క్లుప్తంగా

నియామకం


విజయ్‌కుమార్

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురం గ్రామానికి చెందిన దూసరి విజయ్‌కుమార్ బీజేవైఎం రాష్ట్ర ప్రోటోకాల్ సెల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యాభ్యాసం నుంచి ఏబీవీపీ అనంతరం బీజేవైఎం కార్యకర్తగా పని చేస్తూ అంచలంచెలుగా ఎదిగిన తనను గుర్తించి రాష్ట్ర నాయకులు ప్రోటోకాల్ సెల్ కన్వీనర్‌గా నియమించినందుకు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ సేవాసమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాకన్న



కొడకండ్ల: కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ సేవా సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏడునూతుల గ్రామానికి చెందిన కాయిత యాకన్నను నియమించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోడేటి సత్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా యాకన్న మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సంఘ పటిష్టతకు కృషి చేస్తానని అన్నారు.

నోడల్ ఆఫీసర్‌గా ఇందిర



కొడకండ్ల: ఎల్ఆర్ఎస్ హెల్ప్‌లైన్ డెస్క్‌ను గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. హెల్ప్‌లైన్ డెస్క్ నోడల్ ఆఫీసర్‌గా సూపరింటెండెంట్, ఎంపీఓ ఇందిరను నియమించారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యలైనా కూడా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బచ్చన్నపేట: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణులు శ్రావణ మాసం సందర్భంగా పోచమ్మ తల్లికి బోనాలను చేశారు. గురువారం మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనాల నడుమ ఆలయానికి చేరుకొని పోచమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వెంకటాచారి, మహాత్మాచారి, వెంకటేశ్వర్లు, నర్సింహాచారి, కార్తికేయ, బ్రహ్మచారి, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

పరామర్శ

రఘునాథపల్లి: వెల్ది గ్రామానికి చెందిన నక్కల ఉపేందర్ (39) బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్ పార్టీ నాయకులతో కలిసి గురువారం గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సత్తయ్య, మల్లారెడ్డి, సింగిరెడ్డి తిరుమల్‌రెడ్డి, కొమురయ్య ఉన్నారు.

కేజీబీవీలో వైద్యశిబిరం

తరిగొప్పుల: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎస్‌ఓ గోవిందు రజిత, అనిత, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎం వసంత రాణి, జీపీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు ప్రేమలత, శారద పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

తరిగొప్పుల: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన బండ లచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, బాధిత కుటుంబసభ్యులను రెయిన్‌బో యూత్ అసోసియేషన్ సభ్యులు గురువారం పరామర్శించి 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అధ్యక్షుడు అంకం రాజు, జొన్నగోని రవీందర్, బోగం అనూప్, జొన్నగోని రాజు తదితరులు ఉన్నారు.

సన్మానం

జనగామ రూరల్: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన అమీర్ ఖాన్‌ను గురువారం న్యాయవాది జమాల్ షరీఫ్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకే అందజేసి సన్మానించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య


రవిచందర్ (ఫైల్)

చిల్పూరు: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వంగాలపల్లి రైల్వే గేట్ సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. కోరుట్లకు చెందిన రవిచందర్(28) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని చర్చికి వెళ్తే నయమవుతుందని వారం రోజుల క్రితం వచ్చాడు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మనస్థాపానికి గురై రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య


బచ్చన్నపేట: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


లింగాలఘణపురంలోని కెనరా బ్యాంకు ఎదుట..

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

సాక్షి నెట్‌వర్క్: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు గురువారం పలు మండలాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలు, ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేసి రహదారులపై రాస్తారోకో, బ్యాంకుల ఎదుట ధర్నా చేపట్టాయి. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ చేసి ఆచరణలో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, చెవెల్లి సంపత్, ఎడవెల్లి కృష్ణారెడ్డి, చల్లా చందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రఘునాథపల్లి: రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చిల్పూరు: మాట్లాడుతున్న మనోజ్‌రెడ్డి


జఫర్‌గఢ్‌లో..

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన పెంచుకోవాలి

జనగామ రూరల్: మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన పెంచుకోవాలని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా క్యామల్ ఇనిస్టిట్యూట్ అధినేత డి.మురళీధర్ పాల్గొని వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి మాట్లాడారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు వివిధ బ్రాంచీల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయపాల్‌రెడ్డి

రుణమాఫీ కోసం రైతుల దరఖాస్తులు


దరఖాస్తులు చేసుకుంటున్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతురుణమాఫీలో మొదటి, రెండో, మూడో విడతల్లో మాఫీ కాని రైతులు స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద దరఖాస్తులు చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో రైతులకు రూ.1లక్ష లోపు, రెండో విడతలో రూ.1.50లక్షలు, మూడో దఫా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసిన విషయం విదితమే. అయితే వివిధ కారణాలతో రుణమాఫీ కాని వారు, రుణాలు రూ.2లక్షలకు పైబడి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. మూడు రోజుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా గురువారం సాయంత్రం వరకు 110 వరకు దరఖాస్తులు వచ్చినట్లు ఏఓ చంద్రన్‌కుమార్ తెలిపారు. 90 శాతం దరఖాస్తులు రూ.2లక్షలు పైగా ఉన్న వారివే వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి గైడ్‌లెన్స్ రాలేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ప్రభుత్వ విధి విధానాల ఆధారంగా దరఖాస్తులను పరిశీంచి మాఫీ చేస్తారని ఆయన తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత


మొక్క నాటుతున్న ఎంపీడీఓ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా చెట్లను పెంచాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మధుసూదనచారి అన్నారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో గురువారం 'నాటుదాం ఒక మొక్క -అమ్మపేరు మీద' అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచడమే సరైన మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని, తమవంతు బాధ్యతగా ఐదు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. ఏపీఓ ప్రేమయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కవిత ఎల్లగౌడ్, మహిళా సంఘాల సభ్యులు, ఈజీఎస్ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

స్టేషన్‌ఘన్‌పూర్: రైతుల సమస్యలపై రెవెన్యూ అధికారులు సానుకూలంగా స్పందిస్తూ సత్వర పరిష్కారం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గుగులోత్ మధునాయక్ డిమాండ్ చేశారు. చిల్పూరు మండలం ఫతేపూర్ శివారు దేవులతండాకు చెందిన రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బాధిత రైతులతో కలిసి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధునాయక్ మాట్లాడుతూ చిల్పూరు మండలం ఫత్తేపూర్ శివారు దేవులతండాకు చెందిన రైతులు గుగులోత్ రెడ్డి, గుగులోత్ బిక్కు, గుగులోత్ రాంసింగ్, గుగులోత్ భీమా సర్వేనంబర్ 720లో 4ఎకరాల 4 గుంటల భూమిలో ఏళ్ల తరబడి కాస్తులో ఉండి అందులో సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే అందులో 2 ఎకరాల 2 గుంటల భూమిని కొందరు అక్రమంగా పట్టా చేయించుకున్నారని తెలిపారు. ఈ విషయమై బాధిత రైతులకు తెలువడంతో మోసం చేసిన వారు సదరు భూమిని ఇతరులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. బాధిత రైతుల సమస్యపై ఆర్డీఓ ప్రత్యేక చొరవతో పనిచేయాలని, అక్రమంగా పట్టా చేసుకున్న విషయమై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దొంగల అరెస్టు.. ద్విచక్రవాహనాలు స్వాధీనం


దొంగల అరెస్టు చూపుతున్న సీఐ వేణు


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

స్టేషన్‌ఘన్‌పూర్: ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసే ఇద్దరు దొంగలను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. ఘన్‌పూర్ సీఐ జి.వేణు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై బి.వినయ్‌కుమార్ పోలీసు సిబ్బందితో ఘన్‌పూర్ రైల్వేఅండర్ బ్రిడ్జి వద్ద ఉదయం వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో ఇద్దరు వ్యక్తులు రెండు బైకులతో కనిపించగా వారిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. వారిద్దరు చిల్పూరు మండలం పల్లగుట్టకు చెందిన బండ శ్రీకాంత్, స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన శివరాత్రి ప్రవీణ్ బైక్‌ల దొంగలుగా గుర్తించామన్నారు. సికింద్రాబాద్‌లో ఒక బైక్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లులో ఒక బైక్‌ను దొంగతనం చేసి వాటిని అమ్ముటకు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారు గతంలో కూడా బైక్ దొంగతనాలు చేశారని, మడికొండలోని బోడగుట్ట వద్ద ఒక బైక్, కాజీపేట రైల్వేస్టేషన్ వద్ద రెండు, నల్లగొండ జిల్లా నూతనకల్ వద్ద ఒక బైక్‌ను దొంగతనం చేసినట్లు విచారణలో తెలిపారన్నారు. సదరు బైక్‌లను జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటకు చెందిన కొత్త వినోద్ కుమార్(ముని) వద్ద కుదువపెట్టారన్నారు. గతంలో దొంగతనం చేసిన నాలుగు, ప్రస్తుతం చేసిన రెండు మొత్తం ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితులు ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. కాగా, బైక్ దొంగలను పట్టుకున్న ఎస్సై వినయ్‌కుమార్, సిబ్బంది రవిప్రసాద్, మారుతి, కుమార్, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.

అటెన్షన్ ప్లీజ్



వంతెనపై ప్రమాదకరంగా గుంతలు

జనగామ-సూర్యాపేట రహదారిలో గొల్లపల్లి వంతెనపై గుంతలు పడినా సత్వర నివారణ చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులకు ప్రమాదపు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు వెళ్లే క్రమంలో ద్విచక్రవాహనాలతోపాటు కార్లు గుంతల్లో పడి అదుపు తప్పుతున్నాయి. ప్రాథమిక దశలోనే గుంతలను పూడ్చకుంటే వాహనదారుల ప్రాణాలు గాలిలో కలువడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- దేవరుప్పల

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
రాజారామ్, ఎన్‌హెచ్ డీఈ
ఫోన్‌నంబర్ : 9949492242

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి చెందాలి

రఘునాథపల్లి: మహిళలు స్వయం ఉపాధి మార్గాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం సారయ్య అన్నారు. గురువారం మండలంలోని నిడిగొండ రైతు వేదికలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా నిడిగొండ, రఘునాథపల్లి క్లస్టర్ల పాడి పశువులు, పెరటికోళ్ల మహిళా పెంపకం దారులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మహిళలకు పాడి గేదల ఎంపిక, పోషణ, నిర్వహణపై శిక్షణ అందించారు. సీసీలుస్త్రీనిధి మెనేజర్ రమ్య, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు మహిళా రైతులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ

కొడకండ్ల: మండలంలోని రామన్నగూడెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, ఎంఎన్ఓ గ్రేస్‌కేజియా రాణి స్పోర్ట్స్ డ్రెస్సులను పంపిణీ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులంతా కలిసి 32 మందికి స్పోర్ట్స్ డ్రెస్సులను కొనుగోలు చేయగా వారు అందజేశారు.

హనుమాన్ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన


పూజలు చేస్తున్న అర్చకులు, దాతలు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక తిరుమలనాథ స్వామి దేవస్థాన ఆవరణలో ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి గురువారం శంకుస్థాపన పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య దాతలు, భక్తుల సమక్షంలో శాస్త్రోయుక్తంగా పూజా కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో పంచాంగ సిద్ధాంతికర్త బాణాపురం కృష్ణమాచార్యులు, పూజారులు కలకోట రామానుజచార్యులు, వెంకటనర్సింహాచార్యులు, కలకోట రంగాచార్యులు, దాతలు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, కొలిపాక సతీష్, సునీత, గౌరిశెట్టి శ్రీనివాస్, కుంభం నరేందర్, పాలకుర్తి సోమశేఖర్, పొన్న సత్యనారాయణ, ఎల్లయ్య, వీటీ శ్రీనివాస్, సరాబు ఆంజనేయులు, ఐత ప్రభాకర్, వెంకట్రాంనర్సయ్య, పాలకుర్తి శ్రీను, గోలి శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామ శివారులో ఇప్పగూడెం-పాలకుర్తి రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని చల్లా రాజిరెడ్డి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. బాధితుడి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సముద్రాల గ్రామానికి చెందిన రాజిరెడ్డికి ఇప్పగూడెం-పాలకుర్తి రోడ్డు వెంట వ్యవసాయ భూమి ఉంది. కాగా, బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అతడు రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వారు గుర్తించి డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది. కాగా బాధితుడికి గుర్తు తెలి యని వాహనం ఢీకొట్టిందా, ఎవరైనా దాడి చేసి రోడ్డుపై పడేశారా అని గ్రామస్తులు, అతడి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు రాలేదని సీఐ జి.వేణు తెలిపారు.

ప్రతీ ఎకరాకు సాగునీరందించాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కెనాల్ పర్యవేక్షించి సమగ్ర నివేదికకు ఆదేశం


మాట్లాడుతున్న కడియం శ్రీహరి

హసన్‌పర్తి: స్టేషన్ ఘనపురం నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు గోదావరి జలాలు అందించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. చింతగట్టు క్యాంప్‌లోని నీటి పారుదలశాఖ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జనగామ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాల్లేకపోవడం వల్ల రానున్న కాలంలో రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున గోదావరి జలాల ద్వారా సాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మసాగర్ సౌత్ కెనాల్, నవాబ్‌పేట మెయిన్ కెనాల్, అశ్వరావుపేట రిజర్వాయర్, నష్కల్ నుంచి పాలకుర్తి కాల్వలతో పాటు గండిరామారం రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీల వద్ద పేరుకుపోయిన పూడిక, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలన్నారు. ఇంజనీర్లు క్షేత్రస్థాయికి వెళ్లి సమగ్ర నివేదికను రూపొందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ అశోక్, వరంగల్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, జనగామ ఎస్ఈ సుధీర్‌తో పాటు ఈఈ, డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రామకోటినాయక్


తహసీల్దార్ యుగేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రఘునాథపల్లి: ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోత్ రామకోటినాయక్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలనే డిమాండ్‌తో గురువారం బీజేపీ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు ధరావత్ కిషన్ ఆధ్వర్యాన తహసీల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామకోటినాయక్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో చేవెళ్ల సభ వేదికగా ఎస్టీ డిక్లరేషన్ అమలు చేస్తామని ప్రకటించి విస్మరించడం దారుణమన్నారు. ప్రతీ తండాను రెవెన్యూ పంచాయతీగా ప్రకటించి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ యుగేందర్‌కు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, రాష్ట్ర నాయకులు కావటి ముత్యాలు, సల్ల వాసుదేవరెడ్డి, బోళ్ల రాజ్‌కుమార్, గాదె ఉపేందర్, బోళ్ల అఖిల్, చందర్ నాయక్, తోట మహేష్, చెవ్వ రాజు, ఉడుత రంజిత్, చాతరబోయిన అశోక్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రమోహన్

కొడకండ్ల: బీఎల్ఓ యాప్ ద్వారా ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ కోల చంద్రమోహన్ కోరారు. గురువారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బీఎల్ఓ యాప్, ఇంటింటి సర్వేపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఎల్ఓ యాప్ ద్వారా ఓటర్ జాబితాను సవరించడం జరుగుతుందని, ఈ సర్వేకు ఓటర్లు బీఎల్ఓలకు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు బలరాం, మాస్టర్ ట్రైనర్ అందె సుధాకర్, జూనియర్ సహాయకులు అనిల్, రమేష్, నాగమణి, సోనీ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పాలకుర్తిటౌన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దారు పి.శ్రీనివాస్ అన్నారు. ఓటు హక్కు నమోదుపై గురువారం మండల కేంద్రంలో వివిధ విభాగాల సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నూతన ఓటరు నమోదు బీఎల్ఓల వద్ద లేదా ఆన్‌లైన్‌లోనైనా నమోదు చేసుకునే వీలుందన్నారు. బూత్ లెవల్ అధికారిని సంప్రదించి ఫారం 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే వీలుందన్నారు. ఏఎల్ఎం నర్సింహమూర్తి, డీటీ ఆర్. వేణు, ఆర్ఐ రాకేష్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం


వెంకన్నకు చెక్కును అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: పేద గిరిజన విద్యార్థి ఉన్నత చదువుల కోసం మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పొన్నాల లక్ష్మయ్య రూ.25 వేల సాయం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. నర్మెట మండలంలోని లోక్యతండాకు చెందిన భూక్య వెంకన్న చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. వెంకన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో టెన్త్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి ఉన్నత చదువుకు ఢిల్లీలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించాడు. విద్య ఉచితమే అయినప్పటికీ హాస్టల్ ఇతర ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. వెంకన్న పరిస్థితి సోషల్ మీడియా, పత్రికల ద్వారా తెలుసుకున్న పొన్నాల లక్ష్మయ్య.. పొన్నాల ఫౌండేషన్ ద్వారా రూ.25 వేల చెక్కును పంపించగా గురువారం ఆశ్రమ పాఠశాలలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, ఎండీ మజీద్, రమేశ్‌లు అందజేశారు.


ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

స్నేహితుడి కుటుంబానికి చేయూత

పాలకుర్తి: పాఠశాలలో కలిసి చదివిన స్నేహితుడు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఆపన్నహస్తం అందించి మిత్రులు మానవత్వం చాటుకున్నారు. మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన గంట ప్రభాకర్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. పేదరికంతో అల్లాడుతున్న ఆ కుటుంబానికి మండలంలోని ముత్తారం ఉన్నత పాఠశాలలో 2002 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు రూ.20 వేల ఆర్థిక సాయమందించారు. చంద్రశేఖర్‌గౌడ్, రాజు, మహేష్, రాంచందర్, రాములు, దయ్యాల దేవేందర్ పాల్గొన్నారు.

కొన్నెలో..

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో మల్లెలమ్మ-ఐలయ్య దంపతుల కూతురు భార్గవి వివాహానికి సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్ గౌడ్ రూ. 5వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. సిద్ధిరాములు, క్రాంతికుమార్, ఆశయ్య, చెంద్రయ్య, కిష్టయ్య, రాజయ్య ఉన్నారు.